క్లుప్తంగా

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



ఆలూరులో వాసవీమాత చిత్రపటాన్ని ఊరేగిస్తున్న ఆర్యవైశ్యులు

ఆలూరు: వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి జయంతి సందర్భంగా ఆలూరులో ఆదివారం ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో అమ్మవారి చిత్రపటాన్ని ఊరేగించారు. స్థానిక వాసవీ మాత దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు జనార్దన్‌శెట్టి, సుబ్రమణ్యం, భాస్కర్, శ్రీధర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం పాలపళ్ల ఎద్దులకు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలను దాతల సహకారంతో అందించనున్నట్లు ప్రకటించారు. ఆసక్తి గల వృషభాల యజమానులు రూ.600 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 70135 64624, 93902 36459 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. అలాగే సాయంత్రం 5 గంటలకు పరుగు పందెం ఉంటుందని గెలుపొందిన వారికి మొదటి, ద్వితీయ బహుమతులు కింద 3, 2 తులాల వెండి పతకాలు అందించనున్నట్లు వెల్లడించారు.

తాగునీటి బోర్ల పరిశీలన

నందవరం: మండల పరిధిలోని జగ్గాపురం గ్రామంలో తాగునీటి బోర్లకు విద్యుత్ కనెక్షన్ మంజూరు నిమిత్తం ఆదివారం పంచాయతీ కార్యదర్శి సుజాత, ఎంపీటీసీ హనుమంతమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ గ్రామంలో నీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో గతంలో రెండు బోర్లు వేయించామన్నారు. బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి నీటిని సరఫరా చేస్తామన్నారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కోతి ఈరన్న, నరసరాజు, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: మండల పరిధిలోని దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాత సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేశారు.

బస్సు సర్వీసు ఏర్పాటు

హొళగుంద: మండలానికి పత్తికొండ ఆర్టీసీ డిపో నుంచి బస్సు సర్వీసును అధికారులు ఏర్పాటు చేశారు. ఈ బస్సు ఆదివారం నుంచి అందుబాటులోకి వచ్చింది. మండలంలోని ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలకు వచ్చే భక్తుల కోసం ఇంతకుముందు నందికోట్కూరు డిపో బస్సును ఆర్టీసీ అధికారులు నడిపేవారు. ఆ బస్సును గత కొద్ది నెలలుగా రద్దు చేశారు. దీంతో భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఆ బస్సు స్థానంలో ప్రస్తుతం పత్తికొండ డిపో బస్సును నడుపుతున్నారు. ఈ బస్సు పత్తికొండ నుంచి ఆస్పరి, ఆలూరు వయా ఎల్లార్తి మీదుగా హొళగుందకు చేరుకుని తిరుగు ప్రయాణంలో ఆదే మార్గంలో కర్నూలుకు రాకపోకలు సాగిస్తుంది. ఏదేమైన ఎల్లార్తి మార్గంలో బస్సు సదుపాయం తక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడ్తున్న భక్తులకు ఈ బస్సు ఏర్పాటుతో కొంత సమస్య తీరినట్లయ్యింది.

దేవదాయ భూముల పరిశీలన



దేవదాయ శాఖ భూములపై విచారణ చేస్తున్న ఆదికేశవులునాయుడు

పత్తికొండ రూరల్: అన్యాక్రాంతమైన పత్తికొండ శివారులోని వీరభద్ర స్వామి, చెన్నకేశవ స్వామి ఆలయ భూములను దేవదాయ శాఖ కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ ఆదికేశవులునాయుడు ఆదివారం పరిశీలించారు. విశ్వహిందూ పరిషత్ తాలుకా అధ్యక్షుడు వీరరాజు ఆధ్వర్యంలో భజరంగదళ్ కార్యకర్తలు ఆయన్ను కలిసి దేవదాయ భూములు ఆక్రమణకు గురయ్యాయని, మరికొన్నింటిని కొందరు సొంత ఆస్తిలా ఏకంగా అమ్మేశారన్నారు. ఆలయ భూములను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పిల్లలపై ఓ కన్నేద్దాం

- వేసవి సెలవుల్లో చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- తల్లిదండ్రులు, సంరక్షకుల పర్యవేక్షణ తప్పనిసరి
- నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు



బోరింగ్ వద్ద జలకాలాడుతున్న చిన్నారులు

గోనెగండ్ల: వేసవి కాలం కారణంగా నేటి నుంచి జూన్ 11వ తేదీ వరకు ప్రభుత్వం పాఠశాలలకు సెలవులను ప్రకటించింది. సెలవులు రావడంతో బయటకెళ్లే పిల్లలే అధికం. ఇంటి పట్టునే ఉండి విద్యార్థుల కదలికలపై తల్లిదండ్రులు అప్రమత్తం ఉండాలి. గోనెగండ్ల మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ మొత్తం 64 పాఠశాలలున్నాయి. 11 వేల మంది విద్యార్థులున్నారు. సమయం దొరికితే చాలు చిన్నారులంతా సమీప పాఠశాల ప్రాంగణంలోని ఖాళీ స్థలాల్లో, గ్రామ శివారుల్లో వేసిన లేఅవుట్‌లలో క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ ఆడేందుకు వెళ్తుంటారు. ఎండలో క్రికెట్ ఆడడం వల్ల దాహంతో సమీపంలో అందుబాటులో ఉన్న నీటిని తాగేస్తుంటారు. రక్షిత మంచినీరు తాగకపోతే వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. చిన్నారుల కదలికలపై పర్యవేక్షణ లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశముంది.

ఆటలపై ఆసక్తి

విద్యార్థులు మైదానాల్లో ఆటలపై ఎక్కువ ఆసక్తి చూపుతారు. ఆ సరదా కాస్త వారు నెగ్గే ఆటల్లోనూ, స్కోర్ విషయాల్లో చిన్నపాటి ఘర్షణలు జరిగిన సందర్భాలు మండలంలో ఉన్నాయి. దీనికి తోడు ఎండలు ముదిరి, వడగాడ్పులు వీస్తున్నాయి. పొద్దస్తమాను ఎండలో ఆటలతో గడిపితే సాయంత్రమయ్యే సరికి వడదెబ్బకు సొమ్మసిల్లి పోయే అవకాశాలు ఉన్నాయి. పిల్లలు మధ్యాహ్నం వేళ ఎండలోకి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈతతో ప్రమాదం

చెరువులు, వ్యవసాయ బావుల్లో ఈత కొడుతూ ఆడుకునేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతుంటారు. నీటి లోతుపై వారికి అంచనా ఉండదు. లోతట్టుకు వెళితే నీట మునిగిపోయే ప్రమాదం ఉంది. అలాగే గట్టుపై నుంచి నీటిలోకి దూకడం, ఒకరిని చూసి మరొకరు పోటీగా ఈదులాడడం వంటివి చేస్తే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది. గతంలో చాలా చోట్ల చెరువు, నీటి కుంటల్లో ఈత సరదాల్లో చిన్నారులు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు చూశాం. రెండు రోజుల క్రితం పెద్దనేలటూర్ గ్రామంలో వేణుగోపాల్ అనే ఇంటర్మీడియెట్ విద్యార్థి సరదాగా ఈతకు వెళ్లి బావిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ప్రమాదాలను గుర్తించి చిన్నారులను బావులు, చెరువుల వద్దకు వెళ్లనివ్వకుండా నియంత్రించాలి.

ఇలా జాగ్రత్తలు పాటించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడిపేందుకు ప్రయత్నించాలి. చిన్నారులను ఇంటి నుంచి బయటకు పంపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఖాళీ సమయంలో నిత్యం చదివే పాఠ్యాంశాల పుస్తకాలతో పాటు విజ్ఞాన దాయకమైన పుస్తకాలను చదివేలా ప్రోత్సహించాలి. ఈత సరదా, షికారు, ఎండల్లో ఆటలను నిలువరించి వారి దృష్టిని వేరే వ్యాపకాలపై మళ్లించాలి. మధ్యాహ్నం వేళ ఇంటి వద్ద నీడపట్టునే ఉండి చదరంగం, క్యారమ్స్ తదితర ఆటలు ఆడుకునేలా ప్రోత్సహించాలి.

పర్యవేక్షణే కీలకం



వేసవి కాలం కావడంతో ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. జూన్ 12వ తేదీ పాఠశాలలు పునప్రారంభం అవుతాయి. ఇళ్ల వద్ద పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎండల్లో తిరగకుండా ఇంటి వద్దే రక్షిత నీటిని తాగించాలి. ఈత రాని చిన్నారులను చెరువుల వద్దకు వెళ్లకుండా చూడాలి. చేతులను శుభ్రపరుచుకోవడం అవసరం. పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. సమయం వృథా చేయకుండా పిల్లలకు ఇష్టమైన రంగాల్లో శిక్షణ ఇప్పించడం వంటివి చేయాలి.

– వినోద్ కుమార్, ఎంఈఓ, గోనెగండ్ల

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

హొళగుంద: ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలకు వచ్చే భక్తులకు నీటి వసతి కల్పించేందుకు గాను ఆదివారం పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు గ్రామపెద్ద, దర్గా నిర్వాహకులు మల్లికార్జున తెలిపారు. పొలాల్లో ఉన్న బోరు నుంచి దాదాపు 1,500 అడుగుల దూరంలో ఉన్న దర్గా, మసీదు వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పనులు పూర్తయితే దర్గాకు వచ్చే భక్తులకు తాగునీటి సమస్య తీరుతుందని సొంత ఖర్చుతో ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. భక్తులకు తాగునీటితో పాటు ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బైక్ ఢీకొని దంపతులకు గాయాలు

తుగ్గలి: బైక్‌పై వెళుతుండగా వెనకనుంచి మరో బైక్ ఢీకొట్టడంతో రాంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరాముడు, ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం స్వగ్రామం రాంపల్లి నుంచి భార్యతో కలిసి బైక్‌పై డోన్‌కు బయలుదేరారు. మార్గం మధ్యలో కొత్తపల్లి వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో ముందు వెళుతున్న మరో బైక్‌ను ఢీకొట్టి కిందపడ్డారు. ప్రమాదంలో వెంకటరాముడు, భార్య ఇద్దరు గాయపడ్డారు. బాధితులు డోన్ బ్రహ్మారెడ్డి ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఎవరైనా కక్షతో తమ బైక్‌ను ఢీకొట్టారా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పుష్కర కాలంగా చల్లని సేవ



వెల్దుర్తి పాతబస్టాండు ప్రాంతంలో మధు హెయిర్‌స్టైల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

వెల్దుర్తి: మండలంలో ఓ సెలూన్ షాపు నిర్వాహకుడు నిర్వహిస్తున్న నిత్య చలివేంద్రం పలువురి దాహార్తి తీరుస్తూ ప్రశంసలందుకుంటోంది. వెల్దుర్తి పాతబస్టాండులోని మధు హెయిర్‌స్టైల్ సెలూన్ షాప్ యజమాని ఏడాది పొడవునా ప్రజల దాహార్తి తీర్చేలా 12 ఏళ్లుగా నిత్య చలివేంద్రం కొనసాగిస్తూ చల్లటి సేవ నందిస్తున్నాడు. తన షాప్ ముందున్న చెట్టుకు వాటర్ క్యాన్ వేలాడదీసి అందులో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల దాకా తాగునీటిని అందుబాటులో ఉంచుతున్నాడు. మండల కేంద్రానికి వచ్చి పోయే ప్రజలందరికీ ఈ చలివేంద్రం ఉపయోగపడుతోంది. హెయిర్‌స్టైల్ నిర్వాహకుడు మధు మాట్లాడుతూ స్థానిక హిందీ పండిట్ ఖాజాబేగ్ సూచనతో షాపు ముందున్న చెట్టు నీడలో వాటర్ క్యాన్ ఏర్పాటు చేశాం . సాధారణ కాలంలో రోజుకు 2 లేక 3 బిందెలు, వేసవిలో రోజుకు 8 బిందెల నీరు అవసరమవుతుందని, ప్రజల దాహార్తి తీర్చడం సంతృప్తి ఇస్తోందని పేర్కొన్నారు. అలాగే చెట్టు మొదల్లో జాతీయ జెండా రంగులు వేయడంపై నాయీ బ్రాహ్మణుల దేశభక్తి పట్ల ప్రశంసలు వినిపిస్తున్నాయి.



అలనాటి ఉపాధ్యాయిలతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

మద్దికెర: 'మిత్రమా.. కుశలమా' అంటూ 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు అప్యాయంగా పలకరించుకున్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఆ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు 23 ఏళ్ల తరువాత తిరిగి కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్య నేర్పిన గురువులు నాగేశ్వరరావు, ఖాజాహుస్సేన్, పార్వతిలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ, తహసీల్దారు కార్యాలయాల వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. నిత్యం వివిధ పనుల నిమిత్తం ప్రజలు కార్యాలయాలకు వస్తుంటారు. తీగల కిందకు వేలాడుతూ మనుషులకు తాకేలా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తీగలు చిన్న గాలికి సైతం ఊగుతుండడంతో అటువైపు తిరిగేందుకు ప్రజలు జంకుతున్నారు. విద్యుత్ తీగలను సరిచేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఆలూరు: దేవనకొండ మండలం తెర్నెకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఏబీఎం చర్చి ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్‌ఆర్‌ఐ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. యువతలో ఉత్సాహం నింపేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. క్రీడలు స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. క్రాంతికుమార్, ఏబీఎం చర్చి పాస్టర్ సాధక్ మోరిస్, గ్రామ సర్పంచ్ అరుణకుమార్ తదితరులు ఉన్నారు.

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ఆలూరు రూరల్: ఇంటర్మీడియెట్ పరీక్ష రాసి ఫెయిలైన విద్యార్థులకు సోమవారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు ఆలూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్ తెలిపారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులకు సబ్జెక్టు వారీగా లెక్చరర్లు క్లాసులు తీసుకుంటారన్నారు. నేటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు తరగతులు నిర్వహిస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎమ్మిగనూరుటౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు, ఉత్తీర్ణతా శాతం పెంచుకోనే వారి కోసం సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు రెమిడియల్ తరగతులు నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ ఆదివారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలవరకు పాస్ గ్యారెంటీ ప్రోగ్రాంలో భాగంగా తరగతులు ప్రారంభిస్తామన్నారు.

ప్రార్థనా మందిరానికి తాళం

మద్దికెర: స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రార్థనా మందిరానికి ఆదివారం పోలీసులు తాళాలు వేసి బందోబస్తు నిర్వహించారు. ప్రార్థనా మందిరం తమకంటే తమకే దక్కాలంటూ పారా సంజప్ప, జయప్ప వర్గీయులు కోర్టుల కెక్కారు. జయన్న అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించగా ఏప్రిల్ 28న స్టేటస్‌కో ఇచ్చారని, ప్రార్థనలు చేసుకుంటామని పోలీసులను కోరారు. అయితే పోలీసులు మందిరంలో ప్రార్థన చేసుకునేందుకు ఇరువర్గాల వారికి అనుమతి నిరాకరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాళాలు వేసి బందోబస్తు చేపట్టారు. దీంతో ఆదివారం ప్రార్థనలు చేసేందుకు వచ్చిన క్రైస్తవులు వెనుదిరిగి వెళ్లారు.

విద్యా కానుక కిట్లు వచ్చేశాయ్



ఎమ్మార్సీ భవనంలో ఉంచిన జగనన్న విద్యా కానుక కిట్లు

గోనెగండ్ల: జగనన్న విద్యా కానుక కిట్లు ఆదివారం మండల కేంద్రానికి చేరినట్లు ఎంఈఓ వినోద్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల్లోని 55 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కిట్లు మంజూరైనట్లు చెప్పారు. కిట్లను స్థానిక ఎమ్మార్సీ భవనంలో భద్రపరిచినట్లు తెలిపారు. జగనన్న విద్యా కానుకలో యూనిఫాం, స్కూల్ బ్యాగు, నోట్ పుస్తకాలు, షూస్, రెండు జతల సాక్సులు, బెల్ట్, డిక్షనరీ ఉంటాయని వివరించారు. మొదటి విడతగా 11,880 మంది విద్యార్థులకు యూనిఫారాలు వచ్చాయని చెప్పారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభించిన మొదటి రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తామన్నారు. సీఆర్పీలు పుల్లన్న, రవి, చెన్నకేశవులు తదితరులు ఉన్నారు.

ఒక్కటైన జంటలు



నవ దంపతులను ఆశీర్వదిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: భగవంతుడి దీవెన, చల్లని చూపు ఉంటే ప్రతి ఫలం తప్పక లభిస్తుందని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. హాలహర్వి మండలం బల్లూరు గ్రామంలో బల్లూరయ్య స్వామి దేవాలయంలో ఆదివారం శివయ్య స్వామి వడియార్, కరిలింగప్ప ఆధర్యంలో వివిధ గ్రామాలకు చెందిన 104 జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. వేద పండితుల ఆశీస్సులతో వరులు వధువుల మెడలో మూడు ముళ్లు వేశారు. మంత్రి గుమ్మనూరు జయరాం నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం మంత్రిని కురుబ కులస్తులు పూలమాలలతో సత్కరించారు. కురుబ కులస్తులు, గొరవయ్యలు బీరప్ప డోలు వాయించి సంబరాలు నిర్వహించారు. ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, బల్లూరు సర్పంచ్ మారెన్న, ఎంపీటీసీ సభ్యుడు గాదిలింగప్ప, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, నాయకులు లింగప్ప, నెట్టికంఠమ్మ, భీమప్ప తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గూళ్యం గ్రామంలో గాదిలింగప్ప తాత ఆలయాన్ని మంత్రి జయరాం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దహ్యాటలో సామూహిక వివాహాలు



పెద్దహ్యాటలో సామూహిక వివాహాలు జరుగుతున్న దృశ్యం

హొళగుంద: మండల పరిధిలోని పెద్దహ్యాట గ్రామంలోని విరుపాక్ష స్వామి దేవాలయం ఆవరణలో ఆదివారం సామూహిక వివాహాల కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామానికి చెంది కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో నివాసం ఉంటున్న ఆనందగౌడ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 9 నిరుపేద జంటలు వివాహబంధంతో ఒక్కటయ్యాయి. బంధువులు, కుటుంబ సభ్యులతో పాటు గ్రామపెద్దలు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమానికి హాజరైన వారికి భోజనం, విడిది ఇతర సౌకర్యాలను కల్పించారు.

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి

నందవరం: వేసవి సెలవుల్లో విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని హెచ్‌ఎం పద్మావతి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని ధర్మాపురం ఎంపీపీ స్కూల్‌లో పాఠశాల చివరి రోజు కావడంతో విద్యార్థులు కేక్‌కట్ చేసి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలకు సెలవులు రావడంతో పిల్లలపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి కుంటలు, చెరవులు, బావులు, కాలువల వైపు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. ఇంటి వద్ద పిల్లల చదువులపై దృష్టి సారించాలన్నారు. ఉదయం, సాయంత్రం పూట పిల్లలను తప్పని సరిగా చదివించాలని కోరారు. గ్రామాల్లో ప్రత్యేకంగా సమ్మర్‌లో ట్యూషన్స్ నిర్వహిస్తుంటే పిల్లలను పంపించాలన్నారు. వేసవి సెలవులలో పిల్లలకు ఆనందంతో పాటు వినోదం కలిగించే విధంగా ఉండాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, పీఎంసీ చైర్మన్ కాశీం, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరెడ్డి, సుధాకర్, రంగస్వామి, నారాయణ పాల్గొన్నారు.

హొళగుందలో 13.2 మి.మీ వర్షం

హొళగుంద: మండలంలో ఆదివారం తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురిసింది. చిన్నగా చినుకులతో మొదలైన వర్షం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. పుడిమి తల్లి కాస్త చల్లబడి ప్రజలకు ఉపశమనం కలిగింది. గత కొన్ని రోజుల నుంచి ఎండ విపరీతంగా ఉండి ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఈ స్థితిలో రెండు రోజులుగా సాయంత్రం మేఘాలు కమ్ముకుంటున్నా వర్షం దోబూచులాడుతూ ఎట్టకేలకు ఆదివారం వర్షించింది. వర్షం వల్ల మామిడి తోటలకు కొద్దిగా నష్టం వాటిల్లింది. 13.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

తుది దశకు వంతెన పనులు



పూర్తయిన నాగలదిన్నె వంతెన రోడ్డు



తుది దశకు అప్రోచ్ రోడ్డు పనులు

నందవరం: 2009 వరద ధాటికి నందవరం మండలం నాగలదిన్నె బ్రిడ్జి కూలిపోయిన విషయం విధితమే. తెలంగాణ, ఆంధ్ర సరిహద్దులను కలుపుతూ బంధాలకు వారధిగా వంతెన వర్ధిల్లింది. బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం కావడంతో దశాబ్దానికిపైగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడంతో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పట్టుబట్టి వంతెన నిర్మాణం పూర్తికి కృషి చేశారు. ఈ నేపథ్యంలో వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం కంకరతో అప్రోచ్ రోడ్డు పూర్తి చేశారు. బీటీ రోడ్డు పనులు సాగుతున్నాయి. వంతెన పనులు తుది దశకు చేరుకోవడంతో త్వరలోనే రాకపోకలకు సమస్య తీరుతుందని ఇరు ప్రాంతాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అప్రోచ్ రోడ్డు పనులు, బీటీ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేసి నాగలదిన్నె బ్రిడ్జిన్ని త్వరలో ప్రారంభిస్తామని ఆర్‌అండ్ బీ అధికారులు చెబుతున్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రభ ఊరేగింపులో చెక్కభజన నృత్య ప్రదర్శన

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు కనుల పండుగగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామికి అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధన నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాన్ని ప్రభపై ఉంచి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. అనంతరం నందికోల సేవ, ప్రభోత్సవం నిర్వహించారు. ప్రభ ఊరేగింపు వెంట చెక్కభజన కళా బృందం సభ్యులు సందడి చేశారు. రాత్రి ఆలయంలో ధార్మిక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

పత్తికొండ రూరల్: స్థానిక పాతపేటలోని బ్రహ్మంగారి ఆలయంలో ఆదివారం ఆరాధన మహోత్సవాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శరభయ్యాచారి, బ్రహ్మయ్యాచారి స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై ఉంచి గ్రామ పురవీధుల గూండా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు జరిపించారు. మధ్యాహ్నం దేవాలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు శంకరయ్యాచారి, పరమేష్‌ఆచారి, రామాంజినేయులు, బ్రహ్మయ్యాచారి తదితరులు పాల్గొన్నారు. అలాగే పందికోన గ్రామంలో మహానందిఆచారి, వీరయ్యాచారి ఆధ్వర్యంలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం నిర్వహించారు.



పత్తికొండలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మద్దికెర: స్థానిక గుంతకల్లు రహదారిలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామి వారి 330వ ఆరాధనోత్సవాలు పురస్కరించుకొని ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కాలజ్ఞానం చదవి వినిపించారు.

గోనెగండ్ల: స్థానిక బీసీ కాలనీలోని భీమలింగేశ్వర స్వామి, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు పూజారి శివయ్య ఆచారి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం 10 గంటలకు ఉత్సవాలు ప్రారంభించారు. స్వామివారికి అభిషేకం, సహస్రనామ పుష్పార్చన, మహానైవేద్యం, తీర్థప్రసాద వితరణ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.



అమకతాడులో ప్రభపై వీరబ్రహ్మేంద్ర స్వామి

కర్ణాటక మద్యం స్వాధీనం

కౌతాళం: మండలంలోని ఉరుకుంద గ్రామానికి చెందిన గోవిందు అక్రమ మద్యం తరలిస్తుండగా ఆదివారం తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన గోవిందును అదులోకి తీసుకొని కర్ణాటక మద్యం 90ఎంఎల్ పరిమాణం కలిగిన 192 ఒరిజినల్ ఛాయిస్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గోవిందును అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు వివరించారు.



స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న ఎస్‌ఐ

ఆదోని రూరల్ : మండలంలోని జి.హొసళ్లి గ్రామానికి చెందిన చిన్న రామాంజనేయులు అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని అమ్ముతుండగా అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. రామాంజనేయులు వద్ద నుంచి 90ఎం.ఎల్. పరిణామం గల 40 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.